# జీవితం నేర్పిన పాఠాలు

మధ్యాహ్నం ఒంటిగంటన్నర అయ్యింది. సీతరామయ్యగారు భోజనం అయ్యాక భుక్తాయాసంతో నెమ్మదిగా అడుగులు వేనుకుంటూ వచ్చి, వరండాలోని వడక కుర్చీలో తన వయసు మళ్ళిన శరీరాన్ని మెల్లగా సర్దుకుంటూ వెనక్కి వాలారు.

అయిదు నిమిషాలు గడిచాక ఆయన సతీమణి ప్రేమ వక్కపొడి డబ్బీ పట్టుకుని వచ్చి "ఇన్నా" అంటూ ఆయన కుర్చీ పక్కన చతికిలబడింది. "వక్కపలుకు వేనుకోండి మరీ!" అంది ప్రేమగా.

"నోట్లో వెయ్యకూడదటోయ్?" సరసమాడారు సీతరామయ్యగారు.

"అబ్బబ్బా! రోజు రోజుకీ చిన్నపిల్లలైపోతున్నారు కాదూ? తీసుకోండి" అంది ప్రేమ తన చేతిలోని డబ్బీ అందిస్తూ.

ఆయన వక్కపొడి కాస్త తీసి నోట్లో వేసుకున్నారు. ఇంకొంత తీసి చేతిలో పట్టుకున్నారు. "ఇంద" అన్నారు.

"ఇవ్వండి" అంటూ ఆవిడ చెయ్యి జాపింది.

"నోరు తెరవ్వోయ్, నేను వేస్తాను - నువ్వు నాకు వెయ్యకపోయినా" అన్నా రాయన.

"అవ్వ! ఇంకా నయం" అంది ఆవిడ దూరంగా జరుగుతూ. కానీ, సీతరామయ్యగారు చురుకుగా మాట్లాడుతున్నప్పుడు చెయ్యి చాపి వక్కపొడి ఆమె నోట్లో పెట్టారు.

"ఛీ, పాడు! ఇ దేమిటండీ?" అంది ఆవిడ ముసి ముసి నవ్వులతో.

ఆయన గట్టిగా నవ్వారు.

"పాత రోజులు జ్ఞాపక మొస్తున్నాయోయ్, ఆ రోజుల్లో..." ఆయన ఇంకా ఏదో చెప్పేలోపల ఎదు రింటి నుంచి అరుపులు, ఏడుపులు వినిపించాయి.

ఆ ఇంట్లో ఇంతకుముందు అద్దెకున్న వాళ్ళు వెళ్ళాక ఒక యువజంట కొత్తగా వచ్చారు. వా ళ్ళిద్దరూ మూడేళ్ళు పాతబడిన దంపతులు. ఆ యువకుడి పేరు వినయ్. బాంక్‌లో ఆఫీసరు. మధ్యాహ్నం ఇంటికి వచ్చేస్తాడు. అతని భార్య మాలిని. ఆమెకు ఇరవై మూ డేళ్ళు ఉంటాయి. వినయ్‌కి ముప్పై ఏళ్ళు కనబడతా యి.

ఆ పడుచు జంటకి ఇంకా పిల్లలు లేరు. వచ్చిన మొదట్లో ముభావంగా ఏదో పలకరించి మాట్లాడారు. నాలుగు వారా లయ్యింది.

ఇల్లు సర్దుకుని, సరదాలతో, షికార్లతో సంతోషంగా ఉండాల్సింది పోయి రోజూ కీచులాడుకుంటారు ఆ యువ దంపతులు.

వాళ్ళ గొడవ ఏమిటో అంతుబట్టలేదు ఆ వృద్ధ దంపతులకి.

సీతరామయ్యగారు రిటైర్ అయ్యారు. ఆయన కొడుకు ఈశ్వర్ అమెరికాలో సెటిలైపోయాడు. కొడుకు దగ్గరికి వెళ్ళడానికి ఆయన ఇష్టపడలేదు. కోడలి ప్రవర్తన, తీరు ఆయనకి నచ్చలేదు.

అదీ కాకుండా ఈ వైజాగ్ వదిలి రావడానికి ఆయనకి మనసు రాలేదు. ప్రేమకి భర్త ఉన్న చోటే స్వర్గం. ఆమె ఉత్తమ ఇల్లాలు. తన నలభై ఏళ్ళ కాపురంలో భర్తతో ఎన్నో కష్టసుఖాలు పంచుకుం దావిడ. ఆయన ఉత్తమ గుణాలకి ఆవిడ ముగ్ధురాలైంది.

'ఎన్ని జన్మ లెత్తినా ఈయనే నా భర్త కావాలి' అనుకోవడం ఆవిడ జీవితంలో కూడా అనేకసార్లు జరిగిన విషయమే.

భార్య అనురాగం అర్థం చేసుకున్న వివేకవంతుడు సీతరామయ్య. అప్పట్లో... ఆ రోజుల్లో... కొత్తలో... అవును, గొడవ లుండేవి. తను చిరాకు పడేవాడు. కానీ, తరువాత... తరువాత... ఎంతో అదృష్టం ఉంటే గాని ఇలాంటి భార్య దొరకదు. ఈవిడను అపురూపంగా చూసుకుంటాను' అనుకున్నాడు తెలివిగా.

వా ళ్ళిద్దరూ సంతోషంగా వైజాగ్‌లోనే కాలం గడుపుతున్నారు. ఆ ఇల్లు వాళ్ళది కాదు. అద్దె ఇల్లు. సీతరామయ్యగారు ఇల్లు కట్టలేదు. తన డబ్బంతా కంపెనీల్లో ఫిక్సెడ్ డిపాజిట్లలో ఉంచాడు. వడ్డీతో సుఖంగానే గడుస్తోంది. రోగాలు రాకుండా ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకుంటున్నారు ఆ దంపతులు.

"ఏ రోగం లేకుండా నే నెప్పుడో గుండె ఆగి వెళ్ళిపోతా ను ప్రేమా, తరువాత డబ్బు నీకు వస్తుంది. మోసపోయి ఎవ్వరికీ ఇవ్వకు. నీ తరువాత ఈశ్వర్‌కి వెళ్తుందిలే!" అన్నా రాయన రిటైర్ అయిన కొత్తలో.

"అయ్యో, ఇంకెప్పుడూ అలాంటి మాటలు అనకండి. ముందు నేను వెళ్ళిపోతా ను" అంది ప్రేమ.

"మరి మళ్ళీ నేను పుట్టేదాకా ఎక్క డుంటావే పిచ్చిదానా? నేను ముందు వెళ్ళి నీకోసం పుడతా ను. నువ్వు పుట్టాక నిన్నే పెళ్ళాడి ఆ జన్మలో నీ భర్త నవుతా ను" అన్నా రాయన నవ్వుతూ.

ఆవిడకి ఏడుపూ, నవ్వూ రెండూ వచ్చాయి. "ఇక చాలండీ ఈ మాటలు! మ నిద్దరం కూడా పైకి వెళ్ళిపోయి అక్కడే ఉండిపోదాం. మళ్ళీ రావద్దు" అంది కళ్ళు తుడుచుకుంటూ.

ఆమె తెలివికీ, ప్రేమకీ ఆయన అచ్చెరువొందారు. మళ్ళీ అలాంటి మాటలు అనలేదు.

ఆ వీధిలో వాళ్ళకీ, పరిచయస్థులకీ వారి దాంపత్యం ఆదర్శ మైంది. అందరితో మంచిగా ఉండి, అడిగినప్పుడు, అవసరమైనప్పుడు సలహాలూ, సహాయాలూ అందజేసే ఆ వృద్ధులని అందరూ గౌరవిస్తారు.

"ఈ ఎదురింటి వినయ్, మాలినిల కాపురంలో ఏవో గొడవ లున్నాయోయ్!" అన్నారు సీతరామయ్యగారు.


"పడుచువాళ్ళు, ఉడుకురక్తం. ఉండవా మరి?" అంది ప్రేమ.

"సర్దుకుపోవడం తెలీదు లాగుంది. పెద్ద వా ళ్ళెవరూ లేరు కాబోలు!"

"పెద్దల మాటలు వినే వా ళ్ళెవరండీ ఈ రోజుల్లో? తల్లిదండ్రులనే గౌరవించడంలేదు పిల్లలు. అన్నలకీ, అక్కలకీ అసలే మర్యాద లేదు. అత్తమామలనే గౌరవించరు అల్లుళ్ళూ, కోడళ్ళూ! మనకీ ఉందిగా ఒక కోడలు. మీ తమ్ముడు మీ మాట విన్నాడా? పెళ్ళాం మాటే విన్నాడు. పెద్దలని గౌరవించే రోజులు ఏనాడో పోయాయి" అంది ప్రేమ తన అనుభవాలని తలచుకుంటూ.

"విన్నా వినకపోయినా పెద్దల మాటల్లో విలువైన అనుభవం ఉందోయ్. తెలివైన వాళ్ళు అది గ్రహించి లాభం పొందుతా రు. విననివాళ్ళు మూర్ఖులు కష్టపడతా రు."

- కప్పగంతుల శ్రీకృష్ణ బహదూర్



"మీ మాటల్లో నిజం ఉన్నా ఇప్పుడు ఎందుకు చెబుతున్నారు? మీ మనసులో ఏదో ఉంది. మీ ఉద్దేశం చెప్పేసేయండి" అంది ప్రేమ.

"అది కాదోయ్, నువ్వు ఆ అమ్మాయికీ, నేను ఆ అబ్బాయికీ నర్దుకుపోవాలని నచ్చజెప్తే ఎలా ఉంటుందీ అని. వాళ్ళు సంతోషంగా ఉండాలనే కోరికతో అంటున్నాను" అన్నారు సీతారామయ్యగారు ఒక రకమైన ఉత్తేజంతో కాళ్ళాడిస్తూ.

ప్రేమ ఆయన్ని చూసి మనసులో నవ్వుకుంది. ఈయనకి పని లేదు - అనుకుంది.

"కళ్ళ ఎదురుగా పడుచువాళ్ళు పంతాలు, పట్టింపులతో కీచులాడుతూంటే వాళ్ళ పనికిమాలిన అహంకారం మనకి నవ్వుగానో, జాలిగానో ఉండవచ్చునండీ. కానీ, వాళ్ళ కది చాలా ముఖ్యమైన విషయంలా ఉంటుంది."

"అయితే ఏమి టంటావోయ్?"

"మీకు తెలీని దేముంది? వాళ్ళ కెంతో ముఖ్యమైన విషయాన్ని మనం 'ఏమ్మా, ఇలాంటివి పట్టించుకోవద్దు. కలిసి మెలిసి ఉండండి' అని చెప్తే ముందు మనల్ని నోరు ముయ్య మంటారండీ. ఎందుకు వాళ్ళచేత చెప్పించుకుని మనం నోరు మూసుకోవడం. ముందే మాట్లాడకుండా ఉంటే మంచిది."

"అదీ నిజమే. ఇన్నాళ్ళూ అందుకే మనం అనవసరంగా ఎవరి విషయాల్లోనూ జోక్యం చేసుకోలేదు. కానీ, ఎందుకో వీ ళ్ళిద్దర్నీ చూస్తే, ఏమైనా చేసి వీళ్ళు హాయిగా నవ్వుతూ ఉంటే చూడాలని ఉంది" అన్నా రాయన.

"ఎప్పుడో అవకాశం వస్తుంది లెండి. అప్పుడు దారి చూపిద్దాం. పాపం! చిన్నవాళ్ళు" అంది ప్రేమ జాలితో.

** ** **

రెండు రోజులు గడిచాక వాళ్ళకి ఒక అవకాశం వచ్చింది. మొదటి అవకాశం ప్రేమకి వచ్చింది.

ఆ రోజు శుక్రవారం. సీతారామయ్యగారు అలవాటుగా పొద్దున్న తొమ్మిది గంటలకి గుడికి వెళ్ళారు. ఎదు రింట్లో వినయ్ ఎనిమి దింటికే బాంక్‌కి బయలుదేరాడు. మాలిని ఎప్పు డెప్పుడు సీతారామయ్యగారు గుడికి వెళ్తారా అని కాపలా కాసి చూస్తోంది లాగుంది. ఆయన అలా వెళ్ళగానే తను ఇలా ప్రేమ దగ్గరకు వచ్చింది.

"రామ్మా..రా. కూర్చో." నవ్వుతూ ఆహ్వానించింది ప్రేమ.

మాలిని ఒక కుర్చీలో కూర్చుంది. బెరుగ్గా చూసింది. ఆ అమ్మాయి సిగ్గు, భయాలతో మాట్లాడలేక అవస్థ పడుతోందని ప్రేమకి అర్థమైంది.

"కాఫీ తీసుకురానా?" అంది.

"వద్దండీ. ఇప్పుడే భోజనం చేశాను."

"మీ ఆయనతో బాటు భోంచేసేశావా?"

"ఆయన మధ్యాహ్నం వచ్చి చేస్తారండీ. నేను పొద్దున్నే భోజనం చేస్తాను. ఆయన టిఫిన్ తినేసి వెళ్తారు."

"త్వరత్వరగా వంట పూర్తి చేసేస్తావు లాగుందే! మిగతా టైమ్‌లో ఏం చేస్తావు మాలినీ?"

"ఆయన కొట్టిన దెబ్బలకి మందులు రాసుకుంటాను. తిట్టిన తిట్లకీ, తిట్టబోయే తిట్లకీ కుమిలిపోతూ ఉంటాను." ఏడుపు స్వరంతో అంది మాలిని.

ప్రేమ హృదయం జాలితో కలుక్కుమంది. తొందరపడి ఏమీ కామెంట్ చెయ్యలేదు. "మాలినీ! నేను వయసులో పెద్దదాన్ని. నీకు తల్లి లాంటి దాన్ని చెప్పమ్మా! ఏమిటి నీ కష్టాలు? నువ్వు ఊరికినే నా దగ్గరకు రాలేదని అర్థమైంది. ఎలాంటి సంకోచం లేకుండా చెప్పు. నావల్ల నీకు ఏ గొడవా రాదు. ఏడుపు వస్తే ఏడ్చేయడం మంచిది. భారం దిగుతుంది" అంది.

మాలిని కళ్ళలో కృతజ్ఞత తొణికిసలాడింది. రెండు కళ్ళనుంచి నాలుగు బొట్లు కన్నీళ్ళు రాలాయి. అతి కష్టంమీద నిగ్రహించుకుంది. చాలాసేపు మాట్లాడలేదు. ఆ తరువాత తన కష్టాలు చెప్పుకుంది. ప్రేమ సానుభూతితో వింది.

మాలిని తల్లిదండ్రులు పేదవాళ్ళు. ఆమె గ్రాడ్యుయేట్ అని చెప్పి తల్లిదండ్రులు పెళ్ళి చేశారు. అది అబద్ధం. మాలిని మూడో సంవత్సరం డిగ్రీ ఫెయిల్ అయ్యింది. వినయ్ ముక్కోపి. అబద్ధం చెప్పి పెళ్ళి చేసినందుకు అతనికి అత్తవా రింట్లో అందరిమీదా ద్వేషం. మాలిని కొక తమ్ముడు ఉన్నాడు. అతను వినయ్‌కి మొదట మర్యాద ఇచ్చినా, అతని తిట్లూ, వ్యవహారం చూసి కోపం వచ్చి తన అక్క భర్త తనకి మొగుడు కాదు పో, పోవోయ్ అనేశాడు. వినయ్ వాళ్ళ దగ్గరికి వెళ్ళడు, తన భార్యని వెళ్ళనీయడు.

అటువైపు కోపం అంతా ఒక రకమైతే అత నింటివైపు నుంచి ఇంకో రకం కోపం.

పేదింటి పిల్ల అని కోడల్ని చులకనగా చూస్తారు వినయ్ తల్లిదండ్రులు. అంతేకాదు, వినయ్ తమ్ముడు అజయ్ బిజినెస్ చేసి అన్న కన్నా శ్రీమంతు డయ్యాడు. తల్లిదండ్రులు అజయ్ దగ్గరే ఉంటారు. వినయ్ దగ్గరకి రారు. వినయ్ అంటే తేలికభావం. ఆ పెద్దల సంస్కారం అలా ఉంది.

ఇక మరిది అజయ్ సంస్కారం ఇంకా ఘోరంగా ఉంది. అందుకు మాలిని అతని చెంప పగలకొట్టింది. కానీ, భర్తకి చెప్పలేదు. ఈ దుర్వ్యాసుడు ఏం చేస్తాడో తెలీదాయె!

అజయ్‌ని చూసి అసహ్యించుకుంటుంది మాలిని. అది అతను ఐశ్వర్యవంతుడని అసూయ అనుకుని వినయ్ ఆమెను తిట్టీ, కొట్టీ గొడవ చేస్తాడు. తను తక్కువ వాడన్న ఆత్మన్యూనతా భావం అతనిని రాక్షసుడిని చేస్తోంది.

పోతే, మాలిని కున్న లోపం ఎంత అణుచుకుందామన్నా వీలుకానిది - ఎదురు సమాధానం చెప్పే గుణం. అందువల్ల అగ్నిలో ఆజ్యం పోసినట్లవుతోంది. కాపురం జరగడం లేదు. భార్యా భర్తలని ప్రేమతో బంధించే బిడ్డలు పుట్టడం లేదు. వినయ్ విడాకు లిస్తా నంటున్నాడు. మాలినికి మార్గం తోచడం లేదు.

అన్యోన్యమైన దాంపత్యానికి ప్రతిరూపాలైన సీతారామయ్యా, ప్రేమా దారి చూపిస్తారేమో అనే ఆశతో వచ్చింది మాలిని.

ప్రేమ, మాలిని చెప్పినదంతా వింది. ఆ అమ్మాయిని జాలితో చూసింది. ఆడపిల్ల జీవితం అడుగడుగునా కష్టాలతో నిండి ఉంటుంది. ఎంతో జాగ్రత్తగా బ్రతకాలి. ఈ అమ్మాయి తల్లి చదువుకుని ఉండదు. ఏదీ చెప్పగలిగే అవకాశం ఉండి ఉండదు. కష్టాలతో వివేకం కోల్పోతోంది ఈ అబల. తను తల్లిలా ఈమె జీవితం తీర్చిదిద్దాలి.

గొంతు సవరించుకుని తెలివిగల వాళ్ళలా తూచి తూచి మాట్లాడింది ప్రేమ. "మాలినీ! దాంపత్యం ఒక ఇల్లు లాంటిది. ఒక ఇంటి పునాదిలో కనబడని కంకర, కొండరాళ్ళు ఉంటాయి. పైన ఇటుకలు ఉంటాయి. వాటిమీద అతుకు వేసే సిమెంటు ఉంటుంది. ఆ సిమెంటు మీద రంగులు పూస్తే ఇల్లు అందంగా కనబడుతుంది. నీకు తెలుసు కదా!"

తెలుసు అన్నట్లు తల ఊపింది మాలిని.

"మాలినీ! అవమానాలు, అబద్ధాలు, అహంభావం అనే మట్టిని ముందు తీసి అవతల పారేసి పునాది తవ్వాలి. సర్దుకుపోయే స్వభావం అనే కొండరాళ్ళతో నీకు నేను, నాకు నువ్వు అని భార్యా భర్తలు ఇంట్లో ఇటుకలు కావాలి. బలమైన గోడలుగా మారాలి. సమస్తమైన బరువుల్నీ భరించాలి. భర్తని ఎదిరించకుండా, అవమానించకుండా, తనని విసుక్కున్నా ఓర్పుతో సహిస్తూ, మగవాడికి రోషం ఉంటుంది, అతను బయట ప్రపంచంలో పోటీల్లో చాలా కష్టాలు పడుతున్నాడు, ఆ కష్టాలు తనకోసం పడుతున్నాడు, అతడు తనవాడు, అతని క్రోధం తనమీద తీర్చుకోవడం సానుభూతితో అర్థం చేసుకోవాలి, తను రెచ్చిపోయి అతన్ని రెచ్చగొట్టి కొట్టేదాకా రానీయకుండా, సహనం చూపాలి - అని నిర్ణయించుకోవాలి. ఆ నిర్ణయమే సిమెంటులా ఇంటిని బలంగా కలిపి ఉంచుతుంది. చిరునవ్వు నవ్వడం, తప్పులు ఒప్పుకోవడం, క్షమించమనడం, మళ్ళీ తప్పులు చెయ్యకుండా ఉండడం - ఇవే ఇంటికి కళ నిచ్చే రంగులు. దాంపత్య మనే ఇల్లు వీటివలనే స్వర్గసీమలా మారుతుంది. ఇక కష్టసుఖాలు తలుపులు, కిటికీల లాటివి. అవి మూసుకుంటాయి, తెరుచుకుంటాయి. జీవితంలో తప్పనిసరి అవి" అంది ప్రేమ.

ఆశ్చర్యంగా చూస్తూ వింది మాలిని. "మా అమ్మ కూడా ఇంత బాగా చెప్పలేదు. ఒక తల్లిలా ఎంత బాగా చెప్పా రమ్మా!" అంది భావావేశంతో.

"నా జీవితంలో అనుభవాలు ఇలా పాఠం చెప్పడం నేర్పాయి మాలినీ!" అం దావిడ నవ్వుతూ.

"అనుభవాలా?"

"నీ మరిదిలాగే నాకూ ఒక మరిది ఉన్నాడు. అతను కాముకుడు కాదు, కృతఘ్నుడు. మాచేత చాకిరీ, సేవలు చేయించుకున్నాడు. చెట్టు కింద ప్లీడరులా ఉండవలసిన వాడు, మా నీడలో పెరిగి పెద్ద లాయరై మాతో తగాదా పెట్టుకుని, తన భార్య చెప్పుడు మాటలు విని మమ్మల్ని తిట్టి విడిపోయాడు. మా కో కోడలు ఉంది. మా కొడుకుని కంట్రోల్లో పెట్టుకుని మాకే కన్నీళ్ళు తెప్పించింది. ఇవన్నీ అవమానాలు, అబద్ధాలు, అహంభావం అనే మట్టి మాలినీ! ఈ మట్టిని నేను గానీ, మావారు గానీ ఒకరిమీద ఒకరం చిమ్ముకోలేదు. ఎత్తి అవతల పారేశాం. మీరూ అలాగే ఉండాలి. మొదట నువ్వు ప్రారంభించు. నీ భర్తకే అర్థ మవుతుంది. అతనూ ఈ చెత్తని మనసులో పేర్చుకోవడం మానేస్తాడు" అంది ప్రేమ.

"అర్థమైం దమ్మా! ఇక జాగ్రత్తగా కాపురం కాపాడుకుంటాను" అంది మాలిని లేస్తూ.

"మాలినీ! అణిగి ఉండే ఆడదాన్నే మగవాడు ఇష్టపడతాడు. అణకువతో ఆడది కాపురంలో రాజ్య మేలవచ్చు. కీచులాటలూ, వాదాలూ, కొట్టుకుని విడిపోవడం దాకా వెళతాయి. నేను నీ వ్యక్తిత్వాన్ని వదులుకోమనడం లేదు. వినయంతో వంగమంటున్నాను కానీ, విసుగుతో విరిగిపో అనట్లేదు" అంది ప్రేమ.

"అర్థమైం దమ్మా!" అంది మాలిని.

"ఏమిటి అర్థమైంది?" అడిగింది ప్రేమ.

"నమ్రతతో నెత్తి నెక్కమంటున్నారు" అంది మాలిని నవ్వుతూ.

ఆమె తెలివికీ, మాటలకీ విరగబడి నవ్వింది ప్రేమ. నవ్వి నవ్వి ఆమె కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

** ** **

ఆదివారం పొద్దున్న సీతారామయ్యగారికి వినయ్‌కి ఉపదేశం చేసే అవకాశం వచ్చింది.

వినయ్ పది గంటలకి ఆయన దగ్గరికి వచ్చాడు. అప్పుడే గుడినుంచి తిరిగి వచ్చా రాయన.

"సార్! మీ సుత్తి ఒకసారి ఇస్తారా?" అడిగాడు వినయ్.

"కూర్చోవోయ్! ఇస్తాను" అన్నా రాయన.

వినయ్ కుర్చీలో కూర్చున్నాడు. అతన్ని చూసి ప్రేమ కాఫీ కలిపి తెచ్చింది. వినయ్ మొహమాటంగా అందుకున్నాడు. సీతారామయ్యగారు లోపలికి వెళ్ళి సుత్తి తీసుకువచ్చారు. ఒక కుర్చీలో కూర్చుని సుత్తి కింద పెట్టారు.

"ఏమోయ్! ఈ నుత్తి కావాలంటే నే చెప్పే నుత్తి వినాలి. ఏమనుకోవు కదా!" అన్నారు నవ్వుతూ.

"అలాగే. చెప్పండి సార్!" అన్నాడు వినయ్ కాఫీ తాగేసి.

"పెద్దవాడిని నా చాదస్తం, నేను చెబుతున్నాను. కోపం తెచ్చుకోకూడదు" అన్నా రాయన.

"నా ఇంట్లో విషయాల గురించా సార్?"

"అవును."

"అసలు నేనే మిమ్మల్ని అడుగుదా మనుకుంటున్నానండీ!" అన్నాడు వినయ్.

అంతవరకూ అక్కడ నిలబడ్డ ప్రేమ నెమ్మదిగా లోపలికి వెళ్ళిపోయింది.

"చెప్పవోయ్! నీ కేవో గొడవ లున్నాయి. అవి చెప్పుకుంటే కొంత బాధ తీరుతుంది. నా కొడుకు నా మాటలు వినకపోయినా, నీలాంటి బుద్ధిమంతులు వింటే నా కొడుకు నా మాట విన్నట్లు సంబరపడిపోతాను. ఇద్దరికీ బెనిఫిట్టే" అన్నారు సీతారామయ్యగారు.

మనను విప్పి తన భార్యవైపు నుంచి కలిగిన కష్టాలన్నీ చెప్పేశాడు వినయ్.

జాలిగా తల ఊపారు సీతారామయ్యగారు.

"జీవితం నరకం అయిపోతోంది సార్! విడాకులు తీసుకుందా మనుకుంటున్నాను" అన్నాడు వినయ్ బాధగా.

"అవసరం లేదు వినయ్. నాకూ ఇలాంటి చికాకులు ఎన్నో ఏర్పడ్డాయి. నువ్వు చదువుకున్న వాడివి. నేను చెప్పేది అర్థం చేసుకో. ఆచరణలో పెట్టు. నేను ఇలా చెయ్యబట్టే మా కాపురం ఈనాటికీ సంతోషంగా గడిచిపోతోంది. నీ కాపురం కూడా హాయిగా ఉంటుంది."

"చెప్పండి సార్!"

"వినయ్! మగవాడికి రోషం ఉంటుంది. ఉండాలి కూడా. అత్తవారి ఇంట్లో అవమానాలు సహించకూడదు. కానీ, నువ్వూ వాళ్ళని బాధపెట్టకూడదు. నీ భార్యనీ బాధపెట్టకూడదు. కిరోసిన్ హత్యలు చేసే కిరాతకుడివి కాదు నువ్వు. పగబట్టే పర్వర్టెడ్ మనిషివీ కావు."

"నిజమే సార్! కానీ నేను మోసపోయాను." కోపంగా అన్నాడు వినయ్.

"కరెక్టే. మోసపోయినప్పుడు ఎదుటివాళ్ళు మనను తక్కువగా అంచనా వేసి అన్యాయం చేశారని ఒళ్ళు మండిపోతుంది. కానీ, కోపాన్ని అణచుకోవాలి వినయ్!"

"ఎలా సార్?"

"పదే పదే జరిగిన మోసాన్నీ, అవమానాల్నీ గుర్తు తెచ్చుకోకు. మోసం చేసినవాళ్ళు సిగ్గుపడినా, క్షమించమని అడిగినా అది చాలు అనే పెద్ద మనసుతో ఊరుకో. లేకపోతే నీ మనసే పాడైపోతుంది. నీ అత్తమామల తప్పుకి నీ భార్యని బాధపెట్టడం నీలాంటి సంస్కారవంతుడికి తగిన పనా వినయ్?"

"నాకు కోపం వచ్చి అరిస్తే అది ఆర్గ్యూ చేస్తుంది. వాళ్ళ వాళ్ళని వెనకేసుకొస్తుంది. వాళ్ళంత వెధవలు!" కసిగా అన్నాడు వినయ్.

"వినయ్! పేదరికం మనుషుల్ని బలవంతాన తప్పులు చేయిస్తుంది. దాన్ని వివేకంతో అర్థం చేసుకో. పేదరికంవల్ల వెధవ పనులు చేస్తే కొంతవరకూ నీ అంతట నువ్వే క్షమించాలి. నువ్వు అస్తమానం విసుక్కుంటే నీ భార్యకీ విసుగెత్తిపోతుంది. నీ భార్య తరపు వాళ్ళు నిన్ను వదిలేశారు. నీ భార్య అలా వదిలేయలేదే! పాపం ఆమె అబల. తనూ ఉప్పూ, కారం తింటోంది. నీవల్లనే నిన్ను ఎదురుతిరిగి విసుక్కుంటోంది. ఇంకేం చేస్తుంది? ఇంకేం చెయ్యలేదు. మనసు విరిగిపోతే ఆత్మహత్య చేసుకుంటుందోయ్! అర్థం కావడం లేదూ? ఆడదాన్ని కొంతైనా అపురూపంగా చూడాలి" అన్నా రాయన.

వినయ్ ఆలోచిస్తూ ఆయన్ని చూస్తున్నాడు.

"వినయ్! నువ్వే నీ భార్యని చీదరించుకుంటే, ఇక నీవాళ్ళూ ఈసడిస్తారోయ్. నీ సైడు బంగారమంత మంచి దనుకోవడం పొరపాటు. నువ్వు కొంత నీ భార్యని గౌరవించాలి. అప్పుడు ఇతరులు కూడా గౌరవిస్తారు. నీ భార్య గుణవంతురాలోయ్!"

"మీ రెలా చెప్తున్నారు?"

"నేను చూస్తున్నాను కదా! పెద్దల దగ్గర మర్యాదగా ఉంటుంది. దైవభక్తి ఉంది. వీధి గుమ్మంలో నిలబడదు. నువ్వు లేని టైమ్‌లో ఇంటికి ఎవరు వచ్చినా జాగ్రత్తగా ఉంటుంది. మగవాళ్ళని లోపలికి రానివ్వదు. వస్తువులు జాగ్రత్తగా చూసుకుంటుంది. సోమరితనం లేదు. కూరల మార్కెట్‌లో, షాపుల్లో తెలివిగా కొంటుంది. ఇల్లు జాగ్రత్తగా నడుపుతుందోయ్. వీటిల్లో నా భార్య చాలా చూసి చెప్పింది. ఒక సంసారికి ఇంతకన్నా ఏం కావాలి' చెప్పు" అన్నా రాయన.

వినయ్ మొహం ప్రసన్నమైంది.

"వినయ్! భార్యకి కొంత రూపం, చదువు, తెలివితేటలు ఉండాలి. రైటే. కానీ, వీటిని మించినవీ, ముఖ్యమైనవీ కొన్ని ఉండాలి. అవి గుణం, చురుకుదనం, సంస్కారం. అవి లేని భార్య న్యూసెన్స్ అయిపోతుంది. నీ భార్య గుణవతి. సోమరి కాదు. సంస్కారం, సంప్రదాయం ఉన్నాయి. ఆవిధంగా నువ్వు అదృష్టవంతుడివి. కోపతాపాలు పెట్టుకోక ఆమెను కొంత సుఖపెట్టు. నీకు ప్రేమతో రెట్టింపు సుఖాన్ని ఇస్తుం దా అమాయకురాలు. వెళ్ళు" అన్నా రాయన గంభీరంగా.

"థాంక్స్ సార్! రాక్షసుడిలా మారిపోతున్న నన్ను మనిషిని చేశారు. జాలి, ప్రేమ అనేవి మరిచిపోయాను. ఇక సరైన మగాడిలా, మొగుడిలా ఉంటాని" అన్నాడు వినయ్ నుత్తి తీసుకుని వెళ్తూ.

** ** **

ఒక వారం గడిచాక మధ్యాహ్నం ఒంటిగంటన్న రయ్యింది. సీతారామయ్యగారు భోజనం అయ్యాక రొటీన్‌గా పడక్కుర్చీలో వెనక్కి వాలారు.

ప్రేమ వక్కపొడి డబ్బీతో వచ్చింది. ఆవిడ మాట్లాడేలోపల ఎదు రింట్లో నుంచి వినయ్, మాలిని బయటకు వచ్చి తలుపు తాళం వేశారు. ఇటు తిరిగి ఆ వృద్ధ దంపతులని చూశారు.

"సార్! మేము సినిమాకి వెళ్తున్నాం. మా ఇంటివైపు ఒక కన్నువేసి ఉంచండి" అన్నాడు వినయ్.

మాలిని నవ్వుతూ చెయ్యి ఊపింది. ఇద్దరూ వెళ్ళిపోయారు.

"వీళ్ళు ఇంత త్వరగా కలిసిపోయారే!" ఆశ్చర్యంగా అంది ప్రేమ.

"క్షేత్ర మెరిగి విత్తనం, పాత్ర మెరిగి దానం చెయ్యాలోయ్. వయసులో ఉన్న దంపతులు సారవంతమైన భూమి వంటివారు. వాళ్ళలో ప్రేమ అనే విత్తనం నాటితే పెద్ద చెట్టైపోతుంది. తెలివైన వాళ్ళు మంచి సలహా ఇవ్వగానే వెంటనే గ్రహించి బాగుపడ్డారు. ఏమంటావోయ్?" అన్నా రాయన.

ప్రేమ మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తోంది.

"ఏమోయ్!" గట్టిగా పిలిచా రాయన.

"అబ్బ, ఉండండి. ఆలోచిస్తూంటే" అం దావిడ.

"నాకు తెలుసులే నీ ఆలోచన. రే పింకో జంట మన సలహాలకోసం వస్తే వాళ్ళకి అమ్మాయ్, దాంపత్యం ఒక చెట్టు లాంటిది. చెట్టుకి ఆకులు, పువ్వులు, బెరడు, కాయలు, వేర్లు ఉంటాయి. అలాగే... అంటూ పాఠం నేర్పుతావు."

"అబ్బబ్బా, మీ రున్నారే - మాట్లాడకుండా ఉండరే. నా ఆలోచనలు పాడు చేస్తున్నారు. ఎలా మీ మాటలు ఆపడం? ఊఁ" అంది ప్రేమ తల పంకిస్తూ.

మాట్లాడబోతున్న సీతారామయ్యగారి నోట్లో చటుక్కున పొడి వేసింది. నవ్వుకుంటూ నమలసాగారు ఆయన. ★

